దివ్యాంగ మహిళలపై వేధింపులు అరికట్టాలి

సుందరయ్య విజ్ఞానకేంద్రం: దివ్యాంగ మహిళలపై వేధింపులు అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.జ్యోతి డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో వికలాంగ మహిళా సాధికారితపై రెండోరోజు సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జ్యోతి మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకంతో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో దివ్యాంగ మహిళలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. మహిళా రిజర్వేషన్‌ల అమలులో భాగంగా వారికి ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. అంతేకాకుండా దివ్యాంగ మహిళల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్, అడవయ్య, మహిళా కన్వీనర్ సాయమ్మ, ఆర్.వెంకటేశ్, వరమ్మ, యశోదా, ఆరిఫా, లక్ష్మి, రాధామ్మ, జయలక్ష్మి, షబానాబేగం పాల్గొన్నారు.

జ్యోతిష్యం సైన్స్‌తో కూడిన విజ్ఞానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జ్యోతిష్యం అనేది మూఢనమ్మకం కాదు ఇది సైన్స్‌తో కూడిన విజ్ఞానం అని ప్రముఖ జ్యోతిష్య శాస్త్ర వేత్త జాల సోమనాథ శాస్త్రీ అన్నారు. ఆదివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. తంగిసపల్లి నర్సింహాచారి కల్పన కృష్ణప్రియ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మేళనానికి పలువురు జ్యోతిష్య శాస్త్ర విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమనాథ శాస్త్రీ మాట్లాడుతూ... విద్యార్థులతో దాగిఉన్న విజ్ఞానాన్ని వెలికి తీయడానికి జ్యోతిష్య శాస్త్రం దోహదపడుతుందన్నారు. జ్యోతిష్య శాస్త్రం మూఢ నమ్మకాలను ప్రోత్సహించదని సైన్స్‌తో కూడిన విజ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తుందన్నారు. ప్రముఖ జ్యోతిష్య శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రతిభ, డాక్టర్ అనురాధ, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ తంగిరాల శ్రీదేవి, డాక్టర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

300 గజాల ఇల్లు ఉంటే..

ఇంకుడుగుంత తప్పనిసరి

- సర్వే చేపట్టిన జల మండలి సిబ్బంది
- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న బృందాలు
- ఇంకుడుగుంత లేకుంటే తగిన చర్యలు
- ముందు అవగాహన.. తర్వాత జరిమానా..


నీటి పంపిణీ వ్యవస్థను పరిశీలిస్తున్న జలమండలి సిబ్బంది

బంజారాహిల్స్: వేసవిలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. రోజురోజుకూ ఎండల తీవ్రత పెరిగిపోతోంది. ఇప్పుడే ఇలా ఉంటే నిండు వేసవిలో ఎలా ఉంటుందోననే ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది. ఎండల తీవ్రత నేపథ్యంలో రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోర్‌వెల్స్‌లో నీరు ఇంకిపోయి ప్రజలు ఎక్కువ శాతం జల మండలి సరఫరా చేస్తున్న నీటినే వినియోగించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో వేసవి తీవ్రతకు నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండాలంటే ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని జలమండలి గుర్తించింది. ఇటీవలే హైకోర్టు ఇంకుడుగుంతలపై సీరియస్‌గా వ్యాఖ్యలు చేసి వీటిని ఎందుకు అందుబాటులోకి తీసుకురావడం లేదని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో జలమండలి ఉన్నతాధికారులు ఇందుకోసం ప్రణాళికలు రూపొందించి అమలుచేయాలని సెక్షన్ మేనేజర్లకు ఆదేశాలు జారీ చేసింది.

- జలమండలి–6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, తట్టిఖానా, ఎర్రగడ్డ, ఎల్లారెడ్డిగూడ, ఫతేనగర్, ఎస్‌ఆర్‌నగర్, బోరబండ, ఎస్పీఆర్‌హిల్స్, సోమాజిగూడ, వెంగళరావునగర్ తదితర 12 జలమండలి సెక్షన్ల పరిధిలో 300 గజాల స్థలంలో ఇళ్లు ఉంటే ఆ ఇంటికి తప్పనిసరిగా 2012 జీహెచ్‌ఎంసీ బిల్డింగ్ రూల్స్ చట్టం ప్రకారం ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోవాలి. అయితే చాలా నివాసాల్లో, అపార్ట్‌మెంట్లలో ఇంకుడు గుంతలు పనిచేయడం లేదు. వర్షపునీటిని ఒడిసి పట్టుకుంటే వేసవిలో నీళ్ల సమస్య ఉండదని భావించిన అధికారులు ఆ మేరకు ఇంకుడు గుంతలపై దృష్టిసారించారు. గత రెండు రోజులుగా 300 గజాల ఇళ్లు ఉన్న ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మొత్తం 12 బృందాలు రంగంలోకి దిగాయి.
- వీరు ప్రతి ఇంటిని సందర్శించి అక్కడ ఇంకుడుగుంత ఉందో లేదో చూస్తారు.
- లేకపోతే ఇంకుడుగుంత నిర్మించుకోవాలని సూచిస్తారు.
- ఇంకుడుగుంత ఉండీ పనిచేయకపోతే వారికి అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.
- ఆ ఇంకుడుగుంతకు సంబంధించి ఫొటోను తీసుకుని వారికి ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.
- ఇంకుడుగుంతకు మరమ్మతులు చేపట్టి వచ్చే వర్షాకాలంలో నీళ్లు వృథాపోకుండా చూసుకునేలా అవగాహన కలిగించి నీటి ప్రాధాన్యతను తెలియజేస్తారు.
- తాము చెప్పిన తర్వాత కూడా ఇంకుడుగుంత ఏర్పాటు చేయకున్నా, అప్పటికే ఉంటే దానిని వినియోగంలోకి తేకున్నా వారికి నోటీసులు జారీ చేస్తారు.
- నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా స్పందించకుంటే జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి సంబంధిత యజమానికి జరిమానా విధిస్తారు. జరిమానా విధించినా ఇంకుడుగుంత వినియోగంలోకి తీసుకురాకుంటే వారి నల్లా కనెక్షన్‌ను కట్ చేయడానికి వెనుకాడరు.
- ఇలా ఇంకుడుగుంతలపై జలమండలి అధికారులు ఫోకస్ పెట్టి 300 గజాల స్థలంలో ఇళ్లు కట్టిన ప్రతిఒక్కరికీ ఈ వానకాలం నాటికి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

నీటి సరఫరాపై నిరంతర తనిఖీలు..

వేసవి మూడు నెలల పాటు రోజూ జీఎం, డీజీఎం, మేనేజర్లు, లైన్‌మెన్లు క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సరఫరా వేళల్లో పర్యటించి మంచి నీటి సరఫరాను తెలుసుకోవాలి. ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి. జలమండలి డివిజన్–6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధి కిందికి వచ్చే 12 సెక్షన్ల పరిధిలో ఉన్న 90 వేల డొమెస్టిక్ కనెక్షన్లను ఈ మూడు నెలల పాటు రోజూ సంబంధిత అధికారులు పర్యటించి నీటి సరఫరాను సమీక్షిస్తారు. నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటారు. ప్రస్తుతం ఈ తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.


ఇంకుడు గుంతల వివరాలు సేకరిస్తున్న జలమండలి సిబ్బంది

నీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ట చర్యలు



వేసవికాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించి వాటిని అమలుచేస్తున్నాం. ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మా పరిధి కిందికి వచ్చే 12 సెక్షన్ల పరిధిలో ఒక వైపు ఇంకుడుగుంతలపై సర్వే నిర్వహిస్తుండగా, మరోవైపు నీటి సరఫరాపై క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతుంది. ప్రత్యేక బృందాలు తిరుగుతున్నాయి. ఎక్కడైనా సమస్య తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకురావవచ్చు. మా పరిధిలో 23 రిజర్వాయర్లు ఉండగా 90 వేల కనెక్షన్లు ఉన్నాయి. 250 మంది సిబ్బంది పనిచేస్తున్నారు.ప్రస్తుతం ఎలాంటి నీటి సమస్యా లేదు. రిజర్వాయర్లలో తగినన్ని నీరు ఉంది. నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవు. నీటిని వృథా చేయవద్దు.

– హరిశంకర్, జలమండలి జీఎం

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ క్లబ్ అధ్యక్షులు ఆర్.వివేక్ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది. అపోలో, మెడికేర్ ఆసుపత్రి సహకారంతో బీపీ, షుగర్, కంటి పరీక్షలు, ఈసీజీ తదితర పరీక్షలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి పి.వెంకటస్వామిగౌడ్, కోశాధికారి సిరిగిరి శ్యామ్, ఉపాధ్యక్షులు రాజు, కళ్యాణ్ నాయక్, వి.నాగభూషణం, శంకర్‌రావు, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి


ఉచిత శిక్షణను ప్రారంభిస్తున్న కస్తూరి రంగన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్వయం ఉపాధి వైపు యువత పయనించాలని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ కస్తూరి రంగన్ అన్నారు. ఆదివారం కేశవ స్మృతి సంవర్ధన సమితి, కేశవ నిలయం భర్కత్‌పురా సహకారంతో ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 9వ ఉచిత డ్రైవింగ్ బ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కస్తూరి రంగన్ మాట్లాడుతూ సామాజిక దుక్పథంతో పేద విద్యార్థులకు డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వడం ఆదర్శనీయ మన్నారు. కార్యక్రమంలో కేశవ స్మృతి సంవర్ధన సమితి కోశాధికారి రామచంద్రాజీ, ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ప్రొప్రయిటర్ ఉపేందర్, సంవర్ధన సమితి ప్రధాన కార్యదర్శి కొప్పారపు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు ముమ్మరం


వాహనాలను తనిఖీ చేస్తున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద ఎత్తున తనిఖీలను చేపట్టారు. బాగ్‌లింగంపల్లి, సుందరయ్య పార్కు తదితర ప్రాంతాలలో తనిఖీలు చేశారు. ద్విచక్ర వాహనాలు, కార్లను ఆపి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేసిన తర్వాతనే వాటిని అనుమతించారు. ఎన్నికలు పూర్తమయ్యేవరకు తాము చేపట్టే వాహనాల తనిఖీలకు వాహనదారుల సహకరించాలని ఆయన కోరారు.

సికింద్రాబాద్‌లో బీఆర్‌ఎస్ విజయం ఖాయం

- విజయాన్ని కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తాం
- బీఆర్‌ఎస్ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి పద్మారావు

ముషీరాబాద్: పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ స్థానాన్ని బీఆర్‌ఎస్ కైవసం చేసుకోవడం ఖాయమని సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ పార్లమెంటు స్థానం అభ్యర్థి పద్మారావు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ముషీరాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ అధిష్టానం పద్మారావును సికింద్రాబాద్ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయనను నియోజకవర్గంకు చెందిన ఆరు డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజల మద్దతు బీఆర్‌ఎస్‌కే ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు నేటికి మరిచిపోలేదని, కేసీఆర్‌ను మరోసారి బలపరిచి కేంద్రంలో తమ సత్తాచాటే విధంగా సికింద్రాబాద్‌లో విజయం సాధించి కేసీఆర్‌కు బహుమతిగా అందిస్తామన్నారు. ముఠా జైసింహ మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ ప్రజలు బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇచ్చారని తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్‌కు ప్రజలు అండగా నిలిచి పద్మారావును భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం ఆరు డివిజన్ల బీఆర్‌ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రెడ్డి, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.మోజెస్, రాకేష్, వల్లాల శ్యామ్‌యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, పూసగోరఖ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు యువత రాజకీయాల్లోకి రావాలి



హిమాయత్‌నగర్: దేశంలో అవినీతి, అక్రమాలను నిర్మూలించేందుకు ప్రజాసేవే లక్ష్యంగా యువత రాజకీయాలకు రావాలని, చెడు వ్యసనాలను దూరం చేసేందుకు, ఆరోగ్యవంతులుగా ఉండేందుకు క్రీడలు అవసరమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.టి.నర్సింహా పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్ రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన క్రీడోత్సవాల ముగింపు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన నర్సింహా చెస్, క్యారం బోర్డ్, ఖోఖో, క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం పూర్తిగా అవసరమని, గ్రామీణ స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించి అధిక నిధులు కేటాయించాలన్నారు. ప్రస్తుత సమాజంలో యువత, విద్యార్థులు కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితమైన సమయంలో, యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఏ ఐ వై ఎఫ్ క్రీడలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమని వారు అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఆర్.బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, నేతలు మాజిద్, అనిల్, మహేష్, భాస్కర్, శరత్, సజ్జద్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణపై అవగాహన ర్యాలీ



టీబీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కాచిగూడ: టీబీ(క్షయ) వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన వైద్యం అందిస్తే నియంత్రించవచ్చని హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ఏపీ ట్రిబ్యునల్ కోర్టు మాజీ చైర్మన్ జస్టిస్ వామన్ రావు అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకట్రామా రెడ్డి మహిళా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి రోజు దేశ వ్యాప్తంగా వెయ్యి మంది క్షయవ్యాధితో మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందని అన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు క్షయ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, డాక్టర్ బోయిని జగన్మోహన్, డాక్టర్ కటకం భాస్కర్ గుప్తా, డాక్టర్ రుమీల సీతారాం కుమార్, బత్తుల హేమంత్, ఎస్.నవ్య, వి.సంజన తదితరులు పాల్గొన్నారు.

కాపు క్లబ్ హైదరాబాద్ ప్రారంభం


ప్రారంభించిన ప్రముఖ కాపునేత, సంఘసేవకులు ఎన్.శరత్‌శ్యామ్

కాచిగూడ: కాపులందరిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కాపు క్లబ్, హైదరాబాద్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రముఖ కాపునేత, సంఘ సేవకులు ఎస్.శరత్ శ్యామ్ అన్నారు. కాపు క్లబ్ హైదరాబాద్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. కాపు క్లబ్ కన్వీనర్లుగా ఎన్.శరత్ శ్యామ్, ఎం.సాయిబాబు, బి.సుమన్ ప్రకాష్, ఎఎం అనురాధలు వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా మొదటి కార్యక్రమంగా మున్నూరుకాపు, బలిజ కాపు, తెలగ కాపు, కాపు ఉపకులాలకు చెందిన వధూవరుల పరిచయవేదికను నిర్వహించారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచే కాకుండా దేశ, విదేశాలలో ఉంటున్న కాపు కులస్తులు పాల్గొని తమ పిల్లలకు పెండ్లి సంబంధాల కోసం వివాహ పరిచయ వేదికలో పాల్గొన్నారు. కాపు సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు క్లబ్ ద్వారా వివాహ పరిచయ వేదికలను ఏర్పాటు చేసి సంబంధాలను కుదుర్చడం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, పవన్‌కుమార్ నాయుడు, సి.నారాయణరావు, వై.హనుమంతరావు, వై.కృష్ణకుమారి, మురళీకృష్ణ, బి.శ్రీహరి బాబు, రేవంత్, బెల్లపుకొండ ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి
- అఖిల భారత రజక సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మొగ్గ అనిల్ కుమార్


నిరాహార దీక్ష చేస్తున్న రజక సంఘం నాయకులు

కవాడిగూడ: అన్ని రంగాలలో వెనుకబడిన రజకుల అభివృద్ధి సంక్షేమం కోసం తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని అఖిల భారత రజక సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మొగ్గ అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో పోరాటం సాగించి రాష్ట్రాన్ని సాధించిన రజకులకు నేటికీ న్యాయం జరగకపోవడం అన్యాయం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రజక కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అవ్యవస్థాపక అధ్యక్షుడు మొగ్గ అనిల్ కుమార్ మాట్లాడుతూ... అన్ని కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తూ రజకులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం రజకులను మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే రజక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రజకులతో కలిసి ఆందోళనలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 2 శాతం జనభా ఉన్న కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా 18 లక్షల జనాభా కలిగి ఉన్న రజకులకు మాత్రం కార్పొరేషన్ ఎందుకు ఏర్పాటు చేయలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రజక కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. నిరాహార దీక్షలో రజక సంఘం సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు భాను సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు చీరాల రాజు, గజ్వెల్ జిల్లా నాయకులు నాగరాజు, నేతలు కిషన్, శ్రీనివాస్, గణేష్, నవీన్, శ్రీను, రాహుల్, రజక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కామదహనం

సంబరాల్లో పాల్గొన్న కాలనీ వాసులు, చిన్నారులు



చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీ దుర్గనల్లపోచమ్మ ఆలయంలో హోలీ పండుగ సందర్భంగా కామదహనం కార్యక్రమం వైభవంగా ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్త చామర్తి వాణీశ్వరశాస్త్రి, కేఎంఐటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, శ్రీ దుర్గనల్లపోచమ్మ దేవాలయం ప్రధాన పూజారి భవానీ శ్రీనివాస్, మాజీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ రవిమాన్య, కాలనీ నేతలు ప్రవీణ్‌కుమార్ ముదిరాజ్, కొమటి శ్రీనివాస్, రామకృష్ణ, హోటల్ శరత్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి భారతీయ జనతా పార్టీ (బీజేపీ)తోనే సాధ్యమని ఆ పార్టీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని మళ్లి గెలుపించుకొని సికింద్రాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి మరింత పాటుపడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన హిమాయత్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవతో ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సుందరీకరణ కోసం కోట్లాది రూపాయలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందని గుర్తు చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డిజిటల్ లైటింగ్‌ను, సంజీవయ్య పార్క్‌లో డిజిటల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత కిషన్‌రెడ్డికే సాధ్యమని శ్రీధర్ పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ఖైరతాబాద్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరుతూ ఆదివారం ఖైరతాబాద్ డివిజన్‌లోని బీజేఆర్‌నగర్, మారుతీనగర్, మహాభారత్‌నగర్ కాలనీలలో వివేకానంద సేవా సమితి, లేక్ వ్యూ పార్క్ వాకర్స్ సభ్యులతో కలిసి అవగాహన కల్పించారు. ఇళ్ల మధ్య చెత్తను వేయరాదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే అంటు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ సిబ్బందితో పాటు వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు ఉదయ్ భాస్కర్, బాక్సర్ అశోక్, సురేందర్, ప్రేమ్‌కుమార్, పరమేష్, గోవింద్, నర్సింగ్, సంజీవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాళ్లలో మెరుగైన వసతులు కల్పిస్తా


వజ్రోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజవర్గంలో కమ్యూనిటీ హాళ్ల సమగ్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. అశోక్‌నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ వజ్రోత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. వజ్రోత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ... అశోక్‌నగర్ అసోసియేషన్ కార్యాలయంలో మెరుగైన వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గం పరిధిలో అన్ని కమ్యూనిటీ హాళ్లలో అత్యాధునిక వసతులు కల్పించి పేద, మధ్య తరగతి ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ పావని మాట్లాడుతూ... తాను అసోసియేషన్ చేపట్టే దాదాపు అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్నానని, అటు సాంస్కృతిక, సాహిత్య, సామాజిక సేవా కార్యక్రమాలలో మహిళలతో పాటు అన్ని వర్గాల వారి అభ్యున్నతి కోసం కృషి చేయడం అభినందనీయం అన్నారు. వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. రిటైర్డ్ డీజీపీ ఎస్.కె.జయచంద్రా, నిమ్స్ రెస్పరేటరీ మెడిసిన విభాగాధిపతి డాక్టర్ ఆర్.పరంజ్యోతి, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగకర్త, విశ్రాంత ప్రొఫెసర్ ఎస్.అనంతలక్ష్మి, గోళ్ల మూడి పద్మావతి, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, అశోక్‌నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు రామ్మూర్తి, బాసాని సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు వీణావాద్య కార్యక్రమం లక్ష్మీపద్మావతి నిర్వహించగా, బుర్రకథ ఎం.రామలక్ష్మి బృందం, నృత్యంను ప్రొఫెసర్ సుధాకర్ బృందం నిర్వహించారు.

తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్


మాట్లాడుతున్న కొల్లేటి దామోదర్‌గుప్తా

చిక్కడపల్లి: తెలుగు భాష వ్యాకరణానికి మార్గం చూపిన సీపీ బ్రౌన్ తెలుగు భాషోద్ధారకుడు అని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్తా అన్నారు. శతాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమం ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయసభలోని కళాసుబ్బారావు కళావేదికలో సీపీ బ్రౌన్ సంస్మరణ సభ గానసభ అధ్యక్షుడు కళావీఎస్ జనార్ధనమూర్తి అధ్యక్షత జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కొల్లేటి దామోదరగుప్తా మాట్లాడుతూ... ఆంగ్ల జాతీయుడైన సీపీ బ్రౌన్ తెలుగు భాషా పండితులను తెలుగు నిఘంటువు రూపకల్పన సమైక్యపరచి బ్రౌన్ నిఘంటువును వెలుగులోకి తెచ్చారన్నారు. వేమన పద్యాలు అర్ధ హరిత తాత్పర్యంతో తెలుగుజాతికి అందించిన మహనీయుడు బ్రౌన్ అని కొనియాడారు. సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు, కళాభిమాని గుదిబండి వెంకట్‌రెడ్డి, గాయకుడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం


కాచిగూడలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కాచిగూడ: పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, ప్రాంతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్డులో ప్రజల ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి ఆభా నెంబర్‌ను ఫోన్ ద్వారా నమోదు చేసి కార్డులో పొందుపరిచారు. డాక్టర్ మనోజ్‌రెడ్డి, డాక్టర్ పద్మజ, ఇంద్రజ, సబిత, అనురాధ, లావణ్య, బీజేపీ నేతలు కన్నె రమేష్‌యాదవ్, మల్లికార్జున్, వెంకట్, రమా, ఆర్.సంతోష్, భీమ్‌రాజ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.